సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 12 । మే । 2023



టన్ను చీనీ రూ.37 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి.



గాలివాన బీభత్సం
జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించాయి. విద్యుత్‌స్తంభాలు విరిగిపోవడంతో చాలా ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. IIలో

గరిష్టం/కనిష్టం
40.3°/23.8°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోత ఎక్కువైంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. గంటకు 3 నుంచి 5 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని ప్రభుత్వ ఐటీఐతో పాటు జిల్లాలో ఉన్న ప్రైవేటు ఐటీఐల్లో 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్, కన్వీనర్ బదిరీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.iti. ap.gov.in అన్న వెబ్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8297170834ను సంప్రదించాలన్నారు.

ఎస్పీని కలసిన ధర్మవరం డీఎస్పీ



కొత్తచెరువు: సాధారణ బదిలీల్లో భాగంగా ధర్మవరం నూతన డీఎస్పీగా టి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

విత్తన నాణ్యత పరిశీలన



విత్తనకాయల నాణ్యతను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో గురువారం శ్రీ శివసాయి ఆగ్రోస్ వేరుశనగ విత్తన శుద్ధి కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగకు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనకాయలు కొని మోసపోకూడదన్నారు. ఆయన వెంట డీడీఏ విద్యావతి, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి (టీబీ డ్యాం) వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం సామర్థ్యం 100.855 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.030 టీఎంసీల నీరు ఉంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో 1,291 క్యూసెక్కులు రిజర్వాయర్‌కు కొనసాగుతోంది.

రైతుకు అండ.. జిల్లేడు బండ



జిల్లేడు బండ జలాశయం పనులు వేగంగా జరుగుతున్న దృశ్యం

రాష్ట్రంలో ఎక్కడా సాగు, తాగునీటి కష్టాలు రాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే ధర్మవరం నియోజకవర్గంలో నిర్మిస్తున్న జిల్లేడుబండ ప్రాజెక్టు నాలుగు మండలాలకు వరప్రదాయనిగా మారనుంది. సాగునీటితో పాటు తాగునీటి అవసరాలు తీర్చేలా ఈ ప్రాజెక్టును నిర్మిస్తుండటంతో అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నాలుగు మండలాల్లోని 23 వేల ఎకరాలకు సాగునీరు
- తాగునీటి సమస్యకూ శాశ్వత పరిష్కారం
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- మూడేళ్లలో పూర్తికానున్న ప్రాజెక్టు

ముదిగుబ్బ: ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల సరిహద్దుల్లోని గుడ్డంపల్లి తండా సమీపంలో 2.41 టీఎంసీలు సామర్థ్యంతో జిల్లేడు బండ జలాశయాన్ని నిర్మిస్తున్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో ప్రాజెక్టును నింపి 23 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో 40 మీటర్ల ఎత్తుతో ప్రధాన డ్యాం నిర్మించనున్నారు. 300 మీటర్ల వెడల్పుతో సుమారు 7.925 కిలోమీటర్ల పొడవుతో కట్టను నిర్మాణం జరగనుంది. ఇందుకు 2,200 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు.

భూసేకరణ పూర్తి

జిల్లేడుబండ డ్యాం పరిధిలోని ముదిగుబ్బ మండలంలో పొడరాళ్లపల్లి, చాగాపురం, మంగళమడక, గుడ్డంపల్లి తండా తదితర గ్రామ పొలాలు అలాగే బుక్కపట్నం మండలంలోని గోపాలపురం, రామసాగరం, మారాల తదితర గ్రామాలకు చెందిన పొలాలు ముంపునకు గురవుతాయి. ఈ క్రమంలో అధికారులు 1,900 ఎకరాల భూసేకరణ చేశారు. ఈ భూముల సర్వే కూడా పూర్తి చేసి మార్కింగ్ ఇచ్చారు. అదనంగా పిల్ల కాలువల నిర్మాణం కోసం మరో 300 ఎకరాలు అవసరమవుతాయని పీఎస్‌ఆర్ కంపెనీ అంచనాలు తయారు చేసింది. ఈ ప్రాజెక్ట్ కుడి, ఎడమల కాలువల ద్వారా ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాలకు చెందిన 23 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడంతో పాటు అదనంగా తాగునీరు ఇచ్చేందుకు కూడా వెసులుబాటు ఉంది.

పరిపాలనా అనుమతులు

జిల్లేడుబండ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.680 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. రూ.617 కోట్లతో డిసెంబర్ 2021లో వీటీఆర్, డీఏస్‌ఆర్ కాంట్రాక్ట్ సంస్థలు జాయింట్ అగ్రిమెంట్ చేసుకున్నాయి. ఈ అగ్రిమెంట్‌లో ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేస్తామని ప్రభుత్వానికి తెలియజేశారు.

హంద్రీనీవా ద్వారా 1.33 టీఎంసీలు

జిల్లేడుబండ ప్రాజెక్ట్ సామర్థ్యం 2.41 టీఎంసీలు కాగా, అందులో 2.18 టీఎంసీలు సాగు నీటి కోసం వాడుకోవచ్చు. మిగిలిన 0.23 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతారు. ఈ ప్రాజెక్టుకు హంద్రీనీవా కాలువ ద్వారా 1.33 టీఎంసీల నీటితో నింపుతారు. మిగిలిన 1.18 టీఎంసీల నీరు వర్షాల ద్వారా అందుతుందని అధికారులు అంచనా వేశారు.

వైఎస్సార్ హయాంలోనే పునాది

2004లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.7 కోట్లతో జిల్లేడు బండ జలాశయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ హయాంలోనే మరో రూ.4 కోట్లను అదనంగా నిధులను మంజూరు చేయించారు. అప్పట్లో 0.27 టీఎంసీల నీటి సామర్థ్యంతో అంచనాలు సిద్ధం చేసి ప్రాజెక్టును పూర్తి చేశారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చొరవతో...

జిల్లేడుబండ ప్రాజెక్టు కోసం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తమ నియోజకవర్గ పరిసర ప్రాంతంలో ఎలాంటి ప్రాజెక్టులు లేవని, దీంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కృషి వల్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రత్యేక బృందాలతో అంచనా వేయించారు. రూ.680 కోట్లు మంజూరు చేయించి జలాశయ నిర్మాణం పనులను ప్రారంభించారు. ప్రస్తుతం జలాశయం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

జిల్లేడుబండ నీటినిల్వ సామర్థ్యం
2.41 టీఎంసీలు

సాగునీటి సరఫరా అంచనా
23 వేల ఎకరాలు

భూసేకరణ అంచనా
2,200 ఎకరాలు

పరిపాలన అనుమతులు
రూ.680కోట్లు

రైతులకు ప్రయోజనం



జిల్లేడుబండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే ముదిగుబ్బ మండలంతో పాటు ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు సాగు, తాగునీరు అందుతుంది. ఆయకట్టు కూడా సాగులో వస్తుంది. తద్వారా రైతులు భూముల్లో పంటలు పండించుకొని సంతోషంగా జీవిస్తారు.

– శివశంకర్, గుంజేపల్లి, రైతు

మూడేళ్లలో పనులు పూర్తి



ప్రభుత్వం ఇచ్చిన మూడేళ్ల గడువులోపు ఏజెన్సీల ద్వారా ఈ ప్రాజెక్టును పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కిలోమీటర్ మట్టి కట్టకు డ్రాయింగ్‌కు అనుమతులు వచ్చాయి. సకాలంలో ప్రాజెక్టును నిర్మించేందుకు కృషి చేస్తున్నాం.

– కైలాష్‌రాజు, ఇరిగేషన్ ఏఈ

పక్కాగా చేనేత రిజర్వేషన్ చట్టం



చేనేత నాయకులు, అధికారులతో సమావేశమైన ఆర్డీఓ తిప్పేనాయక్

ధర్మవరం: చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ తిప్పేనాయక్ సమక్షంలో చేనేత కార్మిక సంఘం నాయకులు, పవర్‌లూమ్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు తెలిపారు. పవర్‌లూమ్స్‌లో చేనేత రకాల ఉత్పత్తులను తయారు చేయడం వల్ల చేనేత పరిశ్రమ మనుగడను దెబ్బతీస్తోందని పలువురు చేనేత కార్మిక సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలో విస్తృతంగా దాడులు నిర్వహించి పవర్‌లూమ్స్ మగ్గాల్లో 11 రకాల చేనేత ఉత్పత్తులను తయారు చేయకుండా కట్టడి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు జింకా చలపతి, పోలా రామంజినేయులు, అమీర్‌బాషా, వెంకటనారాయణ, వెంకటస్వామి, మంజునాథ్, గంగాధర్, హ్యాండ్‌లూమ్ అధికారులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

అనంతపురం అగ్రికల్చర్: మూడు రోజులుగా సూరీడు సెగలు కక్కుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీలు మేర నమోదవుతుండగా... రాత్రి ఉష్ణోగ్రతలు 24 నుంచి 29 డిగ్రీల మేర రికార్డవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలు దాటితే దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని చెబుతున్నారు. గాలివేగం బాగా తగ్గిపోవడంతో వేసవితాపం తారస్థాయికి చేరుకుంది. పగలు, రాత్రి తేడా లేకుండా జనం తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి. మరోవైపు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి తుంపర్లు పడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన 'మోచా' తీవ్ర తుఫానుగా మారినా దాని ప్రభావం పెద్దగా ఉండదని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

'జగనన్నకు చెబుదాం' పై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్ పరిధిలోని స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను పాఠశాల విద్య, గ్రామ వార్డు సచివాలయాలు, స్పందన అర్జీలు, గడప గడపకూ మన ప్రభుత్వం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన పిటీషన్లను ప్రతిరోజూ ఓపెన్ చేస్తామన్నారు. ప్రతి పిటిషన్‌నూ పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 1902 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ప్రచారం కల్పిస్తామన్నారు.

మూడు రోజుల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో రీసర్వే చేస్తున్న గ్రామాల్లో మూడు రోజుల్లోగా స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి భూముల రీసర్వేపై స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వే, భూ హక్కు పత్రాల పంపిణీ, స్టోన్ ప్లాంటేషన్, తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్ తదితరులు వీసీలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే చేపట్టిన 26 గ్రామాలకు సంబంధించి 27,146 స్టోన్స్ వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 22,714 రాళ్లు నాటే కార్యక్రమం పూర్తి చేశామని తెలిపారు. వచ్చే ఆదివారం లోపు ఈ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. భూ హక్కు పత్రాలకు సంబంధించి 26 గ్రామాల్లో 6,620 వినతులు రాగా 93 శాతం భూ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్

పనుల్లో పురోగతి లేకపోతే చర్యలు

పుట్టపర్తి అర్బన్: 'జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నాడు–నేడు పనుల్లో పురోగతి చూపించాలి. వారం రోజుల్లోగా పురోగతి కనిపించకపోతే చర్యలు తీసుకుంటాం' అని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మనబడి నాడు–నేడు పనులపై జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని గుడిబండ, ముదిగుబ్బ, బత్తలపల్లి, రామగిరి, అగళి, గోరంట్ల, రొళ్ల, ఎన్‌పీ కుంట, నల్లమాడ, గాండ్లపెంట తదితర మండలాల్లో నాడు–నేడు పనుల్లో పురోగతి తక్కువగా ఉందని వెంటనే పనులు మొదలు పెట్టి వేగంగా పూర్తి చేయాలన్నారు. సిమెంటు వచ్చినా పనులు జరగడంలేదని, అలసత్వం వీడి పనులు చేయించాలన్నారు. పనుల్లో తక్కువ ఖర్చు నమోదు చేసిన హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పనుల్లో పురోగతి చూపని గుడిబండ ఇరిగేషన్ ఏఈకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఈఓ మీనాక్షి, ప్లానింగ్ ఆఫీసర్ మదన్, ఆయా మండలాల ఎంఈఓలు గోపాల్, శ్రీధర్, సుధాకర్, వేమనారాయణ, గోపాల్‌నాయక్, చాముండేశ్వరి, కృష్ణానాయక్, గోపీ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ చేతన్

భూ సమస్యలకు చెక్!



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రమణయ్య. వీరిది ఓడీ చెరువు మండలం తంగేడుకుంట గ్రామం. వీరికి సుమారు వందేళ్ల నుంచి శోత్రియం భూముల సమస్య ఉంది. రమణయ్య తాతల కాలం నుంచి భూమి సాగు చేసుకుంటూ పంటలు పండించుకుంటున్నారు. సాగుభూమికి హక్కు కోసం ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. అయితే 2020లో ప్రభుత్వం సాగు భూమికి హక్కులు కల్పించడంతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. పంటల సాగుతో పాటు బ్యాంకుల్లో రుణాలు తీసుకొని మరింత మెరుగ్గా పంటలు సాగు చేసుకుంటున్నామని రమణయ్య హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జేసీ కోర్టు ద్వారా వివాదాల పరిష్కారం
- జిల్లా వ్యాప్తంగా 532 కేసుల్లో తీర్పు
- ప్రత్యేక దృష్టి సారిస్తున్న జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ వివాదాలతో సతమతమవుతున్న రైతులకు జేసీ కోర్టు భరోసా ఇస్తోంది. సమస్యలకు పరిష్కారం చూపుతుండటంతో అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

బ్రిటీష్ కాలంలోనే ...

సివిల్, క్రిమినల్ కేసులతో కోర్టులపై భారం పడుతుండడంతో బ్రిటీష్ కాలంలోనే సివిల్ కేసుల పరిష్కారం కోసం ఆర్డీఓ కోర్టు, జేసీ కోర్టులను ఏర్పాటు చేశారు. జేసీ కోర్టుకు ముఖ్యంగా భూ సమస్యల్లో ఆర్‌ఓఆర్ రివిజన్ పిటిషన్లు, పట్టాదార్ పాసు పుస్తకాలు, అసైన్‌మెంట్ భూములు, సోత్రియం భూములు, సివిల్ సప్లయీస్‌కు సంబంధించిన కేసులు అధికంగా వస్తుంటాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ చాకచక్యంగా వ్యవహరిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.



స్పందన హాల్‌లో శోత్రియం భూముల సమస్యలు వింటున్న జేసీ టీఎస్ చేతన్ (ఫైల్)

కేసులు	నమోదైనవి	పరిష్కారమైనవి	పెండింగ్
ఆర్‌ఓఆర్ రివిజన్స్	328	82	246
సివిల్ సప్లయీస్	713	418	295
శోత్రియం	72	32	40
మొత్తం	1,113	532	581

తగ్గిన దూరాభారం

ఉమ్మడి అనంతపురం జిల్లా ఉన్న సమయంలో జేసీ కోర్టుకు వెళ్లాలంటే ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వందల కిలోమీటర్ల దూరం వెళ్లడమే కాకుండా కోర్టులో విచారణ ముగిసి ఇంటికి రావాలన్నా రాత్రి అయ్యేది. అయితే సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో నూతన జిల్లాలను ఏర్పాటు చేశారు. అన్ని ప్రాంతాలకు సమదూరంలో ఉన్న పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంతో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పాయి. కలెక్టరేట్‌లోనే జేసీ కోర్టును సైతం ఏర్పాటు చేశారు. జేసీ చేతన్ మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తూ కేసులకు ఆర్డర్ పాస్ చేస్తున్నారు. కేసులను బట్టి నెలకు రెండు మూడు పర్యాయాలు కోర్టు ఏర్పాటు చేస్తూ సమస్యలను సావధానంగా వింటున్నారు. ముందుగానే ఇరు వర్గాలకు నోటీసులు పంపుతూ కోర్టుకు రప్పించి సమస్యలు వింటూ ఇరు వర్గాలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరిస్తున్నారు. జేసీ కోర్టుకు 1,113 కేసులు రాగా 532 కేసులను పరిష్కరించి ఆర్డర్ వేశారు. ఇంకా 581 కేసులు విచారణలో ఉన్నాయి. ఇందులో అనంతపురం జిల్లా నుంచి 242 ఆర్‌ఓఆర్ రివిజన్ పిటీషన్లు రాగా 50 పరిష్కరించారు. 620 సివిల్ సప్లయీస్ కేసులు రాగా 340 దాకా పరిష్కారం చూపారు. జిల్లా ఏర్పాటైన తరువాత 86 ఆర్‌ఓఆర్ రివిజన్ పిటీషన్లు రాగా 32 పరిష్కారం అయ్యాయి. సివిల్ సప్లయీస్ శాఖ పరిధిలోని 93 కేసులు రాగా 78 పరిష్కారం అయ్యాయి. ఇక శోత్రియం భూములకు సంబంధించి 72 కేసులు రాగా 32 పరిష్కారం అయ్యాయి.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఆర్డీఓ కోర్టులో ఉత్తర్వులు పొందిన తరువాత కొంత మంది అర్జీదారులకు తీర్పు నచ్చకపోతే జేసీ కోర్టుకు వస్తారు. కోర్టులో ఇరు వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా తరచూ కోర్టు ఏర్పాటు చేస్తున్నాం. వాదోపవాదాలు విన్న తరువాత ఆర్డర్ పాస్ చేస్తాం. ఇటీవల పౌర సరఫరాలశాఖ దాడుల్లో అక్రమంగా తరలిపోతున్న చౌక బియ్యం, సిలిండర్లు కేసులు నమోదవుతున్నాయి. అన్ని సమస్యలను విని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటునందించాలని జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డీఎల్‌పీఓలు, ఈఓఆర్డీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌లను పూర్తిస్థాయిలో వసూలు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలోని 467 పంచాయతీలకు ఏడాదికి పన్ను, పన్నేతర బిల్లుల వసూళ్లలో జిల్లా ముందంజలో ఉందన్నారు. ఈ యేడాదికి రూ.17 కోట్లు లక్ష్యంగా నిర్దేశించగా 78 శాతం అంటే సుమారు రూ.13.26 కోట్లు వసూలు చేశారని సిబ్బందిని అభినందించారు. వసూళ్లతో పాటు ప్రధాన పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలకు న్యాయమైన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓలు శివకుమారి, శివనారాయణరెడ్డి, 32 మండలాల ఈఓఆర్డీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ విజయ్‌కుమార్

రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రశాంతి నిలయం: పదోతరగతి విద్యార్థులు ఈనెల 13లోపు మార్కుల రీకౌంటింగ్, జవాబు పత్రాల రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. రీ కౌంటింగ్ కోరే విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్‌కు రూ.500, రీ వెరిఫికేషన్ కోరే విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్‌కు రూ.1000 సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

పరిగి: జిల్లాలోని పరిగి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి(పీసీ 1096)ను ఎస్పీ మాధవరెడ్డి సస్పెండ్ చేసినట్లు ఎస్ఐ నరేంద్ర పేర్కొన్నారు. గత శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడిపై చేయిచేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపిన ఎస్పీ మాధవరెడ్డి కానిస్టేబుల్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈమేరకు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

క్లుప్తంగా

కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య


మృతుడు శంకరరెడ్డి


కూడేరు: జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం మరుట్ల-2 కాలనీకి చెందిన శంకరరెడ్డి (40) విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఆయన పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం భార్య వసంత, కుమారుడు తేజేశ్వరరెడ్డిని పొలం వద్దకెళ్లాలని.. కాసేపట్లో తాను కూడా అక్కడకు చేరుకుంటానని చెప్పి పంపాడు. ఎంత సేపటికీ భర్త రాకపోవడంతో చివరకు కుమారుడితో కలసి ఇంటికి భార్య చేరుకుంది. అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న భర్తను చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని శంకరరెడ్డి మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సత్యనారాయణ... అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, శంకర్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ గౌస్.. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. విద్యుత్ శాఖ తరఫున అందాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో అందేలా చేస్తామని భరోసానిచ్చారు.

గాలీవాన బీభత్సం

- జిల్లా వ్యాప్తంగా కూలిన విద్యుత్ స్తంభాలు
- అంధకారంలో పలు గ్రామాలు


హిందూపురంలో కురుస్తున్న వర్షం


ఆర్.యర్రగుంటపల్లి తండాలో కూలిన షెడ్డు


పుట్టపర్తి: కప్పలబండలో కురిసిన వడగండ్లు

పుట్టపర్తి అర్బన్/ధర్మవరం రూరల్/కొత్తచెరువు: జిల్లాలో గురువారం సాయంత్రం పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. రేకుల షెడ్లు ఎగిరి పోయాయి. గాలులు ప్రారంభం కాగానే విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పినా... పలు గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి. ధర్మవరం మండలంలోని ఆర్.యర్రగుంటపల్లి తండాలో గురువారం సాయంత్రం పెనుగాలులకు చోటు చేసుకున్న నష్టంపై రెవెన్యూ అధికారులు అంచనాలు సిద్ధం చేసేందుకు సిద్ధమయ్యారు. రాత్రి 8 గంటలకు కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల పరిధిలో గాలీవానకు ప్రజలు బెంబేలెత్తారు. భారీ చెట్లు నేల కూలడంతో గోరంట్ల – కొత్తచెరువు రహదారిలో గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొత్తచెరువు మండలంతో పాటు పెడపల్లి, బత్తలపల్లి, గువ్వలగుట్టపల్లి, సుబ్బరాయనిపల్లి, మార్లపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. డీఎస్పీ వాసుదేవన్ ఆధ్వర్యంలో సీఐ జయానాయక్, ఎస్ లింగన్న సిబ్బందితో కలసి జేసీబీతో చెట్లను, విద్యుత్ స్తంభాలను తొలగించారు. కప్పలబండలో వడగండ్ల వాన కురిసింది. పెడపల్లిలో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.

వ్యక్తి మృతి


మృతుడు రమేష్‌నాయక్

గోరంట్ల: మండలంలోని గడ్డం తండాలో గురువారం రాత్రి భోజనం ముగించుకుని కుటుంబసభ్యులతో కలసి రేకుల షెడ్డులో నిద్రిస్తున్న రమేష్‌నాయక్ (35)పై పెనుగాలుల తాకిడికి పై కప్పుకు అమర్చిన రేకులు, సిమెంట్ దిమ్మలు కుప్పకూలాయి. దీంతో శిథిలాల కింద చిక్కుకుని ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, పెనుగాలులకు గోరంట్లలోని పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి.

ఎస్పీని కలసిన మధుమతి


ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మధుమతిరెడ్డి, నాగభూషణరెడ్డి

హిందూపురం: జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు చౌళూరు మధుమతి రెడ్డి, ఆమె భర్త నాగభూషణరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం గత ఏడాది అక్టోబరులో హత్యకు గురైన తన సోదరుడు చౌళూరు రామకృష్ణారెడ్డి అంశాన్ని గుర్తు చేస్తూ ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని విన్నవించారు. కాగా, ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ ఇటీవల ప్రధాన నిందితుడు గోపీకృష్ణ డిమాండ్ చేసిన నేపథ్యంలో ఎస్పీని మధుమతిరెడ్డి కలిసి మాట్లాడడం ప్రాధాన్యతను సంతరించుకుంది. స్థానిక నాయకుల వత్తిడి మేరకే తనను ఇరికించినట్లు గోపీకృష్ణ చెప్పుకోవడంపై ఆమె సానుకూలంగా స్పందించడం గమనార్హం. గోపీకృష్ణను మరోసారి విచారించి, అతని వద్ద ఉన్న ఆధారాలు సేకరించాలని ఎస్పీని ఆమె కోరినట్లు తెలిసింది. గోపీకృష్ణ కోరినట్లు కేసు విచారణను సీబీఐకి అప్పగించే అంశంలో తమకు ఎలాంటి అభ్యంతర లేదని స్పష్టం చేసినట్లు సమాచారం.

చెట్టుపై నుంచి పడి రైతు మృతి


చాగంటి కరుణాకరరెడ్డి (ఫైల్)

రాప్తాడు: చెట్టుపై నుంచి కిందపడి ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. రాప్తాడు మండలం భోగినేపల్లికి చెందిన రైతు చాగంటి కరుణాకరరెడ్డి (58)కి భార్య సుశీల, ఇద్దరు కుమారులు ఉన్నారు. మామిడి సాగుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం తోటలోని చెట్టుపై కనిపించిన మాగిన పండును తినాలని ఆశపడి చెట్టు ఎక్కాడు. కాయ కోస్తుండగా కొమ్మ విరిగి కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు.

రాయలసీమ కర్తవ్య దీక్షలు స్వార్థపూరితం

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు రమణ

అనంతపురం కల్చరల్: రాష్ట్ర విభజన జరిగిన సమయంలో సీమకు అనుకూలంగా పల్లెత్తుమాట అనని వారు రాయలసీమ కర్తవ్య దీక్షల పేరుతో మరోసారి సీమ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్టీరింగ్ కమిటీ పేరుతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి సాగుతున్న దీక్షలు స్వార్థపూరితమైనవని పేర్కొన్నారు. సీమ జిల్లాలకు అన్యాయం చేయడమే కాక ఈ ప్రాంతాలను తెలంగాణాలో కలపాలని చూసిన జేసీ దివాకరరెడ్డి, తులసీరెడ్డి, బైరెడ్డి రాజశేఖరరెడ్డి కేవలం తమ ఉనికిని చాటుకునేందుకే ఈ తరహా దీక్షలు చేపట్టారని విమర్శించారు. రాయలసీమకు జీవనాడిలా ఉన్న హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి చేసి నీళ్లను సీమకు తేవడానికి అప్పటి మంత్రి రఘువీరారెడ్డి, ఎంపీ అనంత వెంకట్రామిరెడ్డి పాదయాత్రకు పూనుకుంటే అడ్డుకున్న వారే ఇప్పుడు సీమ పేరుతో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. నకిలీ ఉద్యమాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు.

'కలికిరి' అక్రమాలపై లోకాయుక్త విచారణ

అనంతపురం: జేఎన్‌టీయూ–అనంతపురం పరిధిలోని కలికిరి ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణాలకు సంబంధించి వెలుగులోకి వచ్చిన అక్రమాలపై లోకాయుక్త విచారణ చేపట్టింది. టెండర్లు, కొటేషన్లు లేకుండా అయిన వారికి పనులు అప్పగించి పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టించినట్లు అందిన ఫిర్యాదుల మేరకు లోకాయుక్త న్యాయమూర్తి స్పందించారు. సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఉన్నత విద్యామండలికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో మండలి ఉత్తర్వులు అందుకున్న జేఎన్‌టీయూ (ఏ) అధికారులు.. కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టిన పనులు, నిధుల కేటాయింపులు తదితర అంశాలపై నివేదిక సిద్ధం చేసే పనిలో పడ్డారు. కళాశాల భవన నిర్మాణాలకు రూ.295.15 కోట్లు కేటాయించగా... ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు. భవన నిర్మాణ బాధ్యతలు ఒక ఏజెన్సీకి అప్పగించాలని నిర్ణయించారు. ఈ ఏజెన్సీ నుంచి మరో కాంట్రాక్టు సంస్థకు పనులు అప్పగించారు. పనుల పర్యవేక్షణకు నోడల్ కమిటీని నియామకం చేశారు. అయితే నోడల్ కమిటీ పరిధి దాటి వ్యవహరించింది. కాంట్రాక్టు సంస్థకు ఇష్టానుసారంగా బిల్లులు చెల్లించేలా సిఫార్సులు చేసింది. ఒప్పందం మేరకు రూ.295.15 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉండగా, ఏకంగా రూ.375.46 కోట్లు చెల్లించేశారు. పాలకమండలి ఆమోదం లేకుండానే రూ.80.31 కోట్లు అదనంగా చెల్లించడం వివాదాస్పదమైంది. కలికిరి ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణాల్లో అక్రమాలను తేల్చడానికి విజిలెన్స్ అధికారులు 2020, జనవరి 24న నోటీసులు జారీ చేశారు. అయితే గడువు ముగిసేలోపే వివరాలేవీ అవసరం లేదని విజిలెన్స్ అధికారులు మౌఖికంగా వర్సిటీ అధికారులకు తెలిపారు. దీంతో దర్యాప్తు మధ్యలోనే ఆగిపోయింది. దీనిపై అక్రమాలపై తక్షణమే విచారణ చేపట్టాలంటూ లోకాయుక్తలో విద్యార్థి జయపాల్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కదలిక మళ్లీ మొదలైంది.

'గడప గడపకూ మన ప్రభుత్వం' నిధులు విడుదల

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధుల దృష్టికి స్థానికులు తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పనులకు సంబంధించి నిధులను జగన్ సర్కార్ విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ భాగ్యరాజ్ గురువారం తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో గుర్తించిన 106 పనులకు రూ.408.15 లక్షల అంచనా వ్యయం కాగా, ఇప్పటి వరకు 69 పనులు పూర్తి అయ్యాయని, ఇందుకు సంబంధించి రూ.263.92 లక్షల బిల్లులు జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రధానంగా అనంతపురం నియోజకవర్గంలో రూ.202.30 లక్షలతో 49 పనులు చేపట్టగా, రూ.176.23 లక్షలతో 45 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గుంతకల్లు నియోజకవర్గంలో 11 పనులకు రూ.18.20 లక్షల బిల్లులు అప్‌లోడ్ చేయగా, పూర్తయిన ఐదు పనులకు రూ.12.52 లక్షలు, రాప్తాడు నియోజకవర్గంలో చేపట్టిన రెండు పనులు పూర్తి కాగా రూ.2.87 లక్షలు, రాయదుర్గం నియోజకవర్గంలో పూర్తయిన ఐదు పనులకు రూ.25.14 లక్షలు, శింగనమలలో పూర్తయిన తొమ్మిది పనులకు సంబంధించి రూ.38.72 లక్షలు, తాడిపత్రిలో పూర్తయిన 3 పనులకు సంబంధించి రూ.8.74 లక్షల బిల్లులు మంజూరు చేసినట్లు వివరించారు.

పరిహారం చెక్కు అందజేత


షాహినా భానుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం: ఈ ఏడాది ఏప్రిల్ 17న బత్తలపల్లి మండలం పోట్లమర్రి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో భర్తను, కుమార్తెను కోల్పోయిన బాధితురాలికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల పరిహారం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో గురువారం ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నెల 17న పోట్లమర్రి వద్ద చోటు చేసుకున్న ఆటో ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన విషయాన్ని గుర్తుచేశారు. మృతులకు సంబంధించి ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున సీఎంఆర్‌ఎఫ్ నుంచి పరిహారాన్ని సీఎం వైఎస్ జగన్ అందజేశారన్నారు. ప్రమాదం చోటుచేసుకున్న రోజే మృతి చెందిన ఫయాజ్ మృతి చెందగా... తీవ్రంగా గాయపడి చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన కుమార్తె సాహిస్తా (4) ఈ నెల 7న మృతిచెందడం బాధాకరమన్నారు. కుటుంబానికి అండగా ఉంటానని ఫయాజ్ భార్య షాహినాభానుకు ఎమ్మెల్యే భరోసానిచ్చారు. చిన్నారి మృతితో ఈ ప్రమాదంలో మొత్తం ఆరుగురు మృతి చెందగా బాధిత కుటుంబాలకు రూ.30 లక్షల వరకు పరిహారం మంజూరైనట్లు వివరించారు.

విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యం

- ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించిన విద్యాశాఖ
- రోజూ ఉదయం రెండు సెషన్లుగా తరగతులు

తరగతుల నిర్వహణ ఇలా..		
రోజు	సెషన్ 1	సెషన్ 2
సోమ	గణితం	ఇంగ్లిష్
మంగళ	ఫిజికల్ సైన్స్	హిందీ
బుధ	బయాలజీ	తెలుగు
గురు	గణితం	సోషల్
శుక్ర	ఫిజికల్ సైన్స్	తెలుగు
శని	బయాలజీ	హిందీ

రాప్తాడు రూరల్: జిల్లాలో ఫెయిల్ అయిన ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులను ఎలాగైనా సప్లిమెంటరీ పరీక్షల్లో గట్టెక్కించడమే లక్ష్యంగా విద్యాశాఖ అడుగులు వేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8,875 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా, యాజమాన్యాల పరంగా పరిశీలిస్తే...జెడ్పీ స్కూళ్లల్లో 5,783 మంది, ప్రభుత్వ స్కూళ్లల్లో 914, మునిసిపల్ స్కూళ్లల్లో 997, కేజీబీవీల్లో 481, మోడల్ స్కూళ్లల్లో 288, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో 267, ఎయిడెడ్ స్కూళ్లల్లో 145 మంది ఉన్నారు.

కార్యాచరణ సిద్ధం

ప్రధానోపాధ్యాయులతో పాటు సబ్జెక్టు టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ ఉత్తీర్ణతే లక్ష్యంగా ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. గురువారం (నేటి) నుంచే ఈ ప్రణాళికను అమలు కానుంది. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను రూపొందించారు. ఫెయిల్ అయిన విద్యార్థులందరినీ ఉపాధ్యాయులందరూ సమానంగా దత్తత తీసుకుంటారు. వారి అనుత్తీర్ణతకు కారణాలను విశ్లేషించి, సామర్థ్యాలను అంచనా వేస్తూ సబ్జెక్టుల వారీగా సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయనున్నారు. ప్రత్యేక శిక్షణ తరగతులు రోజూ రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు. మొదటి సెషన్ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రెండో సెషన్ 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుంది.

కారును ఢీకొన్న కంటైనర్


తీవ్రంగా గాయపడిన వెంకటేష్, వెంకటరెడ్డి

గుత్తి రూరల్: కారును కంటైనర్ ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... ఒంగోలు నివాసి వసంత్, హైదరాబాద్‌కు చెందిన సురేష్, ప్రదీప్, నార్సింగ్‌కు నివాసి వెంకటేష్, మియాపూర్‌కు చెందిన వెంకటరెడ్డి, రోహిత్... అనంతపురంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. గురువారం ఉదయం వీరంతా కారులతో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. గుత్తి మండలం వన్నేదొడ్డి సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కంటైనర్ ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వెంకటేష్, వెంకటరెడ్డి, వసంత్‌ను అనంతపురానికి తరలించారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

పిడుగు పాటుకు ఆవు మృతి



గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలో గురువారం సాయంత్రం పిడుగు పాటుకు ఓ ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు నిక్కరు ఓబయ్య తన ఆవును తోటలో చెట్టుకు కట్టేసి వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతో సమీపంలోని గుడిసెలో తలదాచుకున్నాడు. ఆ సమయంలో ఆవును కట్టేసిన చెట్టుకు సమీపంలో పిడుగు రాలడంతో ఆ శబ్దానికి రూ.50 వేలు విలువ చేసే పాడి ఆవు మృతిచెందింది. వర్షం తగ్గిన తర్వాత అక్కడకు చేరుకున్న రైతు కుటుంబం... మృతి చెందిన ఆవును చూసి బోరున విలపించారు.

సైబర్ కవచ్.. నేరాలకు చెక్

అనంతపురం నగరానికి చెందిన రిషిత... బెంగళూరులోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఇటీవల సెలవుపై వచ్చిన ఆమెకు గత సోమవారం రాత్రి ఓ వ్యక్తి ఫోన్‌చేసి 'మీ ఖాతాలోని రూ.45 లక్షలు వేరే ఖాతాల్లోకి జమ అయిందని, ఆ మొత్తాన్ని తిరిగి మీ ఖాతాలోకి మళ్లించాలంటే రూ.5 లక్షలు తక్షణం తాను సూచించిన ఖాతాకు బదిలీ చేయాలని సూచించాడు. ఆ మాటల గారడీలో చిక్కుకున్న రిషిత వెంటనే నగదు బదిలీ చేసింది. అనంతరం తన ఖాతాను పరిశీలించుకున్న ఆమె తాను మోసపోయినట్లు గుర్తించి వెంటనే ఆగంతకుడి ఫోన్ నంబర్‌కు కాల్ చేసింది. అప్పటికే ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మోసపోయిన వారిలో ఉన్నత విద్యావంతురాలు ఉండడం అందరినీ ఆందోళన పరిచే అంశం. ఆన్‌లైన్ మోసాలు... సైబర్ నేరాళ్లపై అవగాహన లేక మోసపోతున్న వారెందరో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయి అవగాహన ఉన్న వారు సైతం దగా పడుతున్నారంటే సైబర్ నేరగాళ్ల పన్నాగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకరి శారీరక కష్టం .. మరొకరి మేథో శ్రమను సైబర్ నేరగాళ్లు తెలివిగా దోచేస్తున్నారు. ఈ తరహా నేరాలు జిల్లా వ్యాప్తంగా తరచూ ఎక్కడో ఒకచోట చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజల డబ్బుకు భద్రత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన 'సైబర్ కవచ్' సేవలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఇటీవల సైబర్ మోసాలు పెరిగిపోయాయి. మొబైల్స్‌లో ఏవేవో యాప్‌లు వచ్చేస్తున్నాయి.. తెలియకుండానే సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ కావడంతో ఫోన్‌లో డేటాను కేటుగాళ్లు సేకరిస్తున్నారు. లింకులు, యాప్‌ల ద్వారా బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టేలా... ఫోన్లలో తెలియని యాప్‌లు, వైరస్, మాల్‌వేర్‌ను గుర్తించి తొలగించేలా జగన్ సర్కార్ ప్రత్యేక చర్యలు తీసుకుంది.

రాష్ట్ర వ్యాప్తంగా కియోస్కీల ఏర్పాటు

చూసేందుకు ఏటీఎం మిషన్ తరహాలో ఉండే సైబర్ కవచ్ కియోస్కీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీ రూపొందించిన ఈ కియోస్కీలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రతి జిల్లాకు మూడు చొప్పున అందజేస్తోంది. దీంతో జిల్లా పోలీసు కార్యాలయం, దిశ పోలీసుస్టేషన్, డీఎస్పీ కార్యాలయాల్లో ఈ మెషిన్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని ఏ పౌరుడైనా వీటి సేవలు పొందవచ్చు. ఈ కియోస్కీల వినియోగంపై వినియోగదారులకు సాయపడేలా శిక్షణ పొందిన ఓ పోలీసు ఉద్యోగి ఉంటారు. వీటి ఫలితాలను బట్టి తర్వాతి రోజుల్లో ప్రముఖ బస్ స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో కియోస్కీలను ఏర్పాటు చేయనున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు బాబాఫకృద్దీన్

హిందూపురం: స్థానిక అహమ్మద్‌నగర్ నివాసి బాబాఫకృద్దీన్ (28) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కార్పెంటర్‌గా పనిచేస్తున్న ఫకృద్దీన్ కొంత కాలంగా గుడిబండ ప్రాంతానికి చెందిన శైలజ అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. హిందూపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న శైలజకు ఆరేళ్ల వయసున్న కుమార్తె ఉంది. ఎంతో ఆరోగ్యంగా ఉండే ఫకృద్దీన్ గురువారం ఉదయం మృతి చెందాడు. కుమార్తెతో సహ శైలజ అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. దీంతో ఫకృద్దీన్ మృతిపై సోదరుడు ఖలందర్ అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సహజీవనం నేపథ్యంలో ఇద్దరూ తరచూ గొడవ పడేవారని, దీంతో ఫకృద్దీన్‌ను వదిలించుకునేందుకు విషపూరిత ఇంజెక్షన్ ఇచ్చి శైలజనే హత్య చేసినట్లుగా అనుమానాలు వ్యక్తం చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కింద హిందూపురం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పట్టాలపై యువకుడి మృతదేహం

గార్లదిన్నె/అనంతపురం సిటీ: మండలంలోని కల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. కల్లూరు సమీపంలో కిలోమీటర్ 238/10 వద్ద పట్టాల మధ్య పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని గ్యాంగ్ మెన్ గుర్తించి, సమాచారం అందించడంతో రైల్వే ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. నల్లప్యాంట్, చేతికి కడియం, సూపర్‌మ్యాన్ బ్యాండేజ్ ధరించిన దాదాపు 30 ఏళ్ల లోపు ఉన్న యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. ఆచూకీ తెలిసిన వారు అనంతపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

భార్యపై కత్తితో దాడి

ఓడీ చెరువు: అనుమానం పెనుభూతమై భార్యను కత్తితో పొడిచి ఉడాయిస్తున్న భర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. ఓడీ చెరువు మండలం కొండకమర్ల గ్రామానికి చెందిన అహమ్మద్, బీబీజాన్ దంపతులు. టైలరింగ్‌తో జీవనం సాగించేవాడు. ఇటీవల పక్షవాతం సోకడంతో అహమ్మద్ పని చేయలేక ఇంటి పట్టునే ఉంటూ వచ్చాడు. దీంతో కుటుంబపోషణ భారమై బీబీజాన్ పలు ఇళ్లలో పాచి పనులకు వెళ్లసాగింది. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న అహమ్మద్ తరచూ ఆమెతో గొడవపడి వేధించేవాడు. గురువారం ఉదయం తీవ్ర స్థాయిలో ఆమెతో ఘర్షణ పడిన అహమ్మద్ చేతికి చిక్కిన కత్తి తీసుకుని విచక్షణారహితంగా దాడి చేసి, పారిపోతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గాయపడ్డ మహిళను సమీప బంధువులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.